




పోస్టల్ సేవలపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు :ఎపి సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఆదేశాల మేరకు బుధవారం నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో 'డాక్ చౌప్పల్' కార్యక్రమం నిర్వహించారు. తపాలా కార్యాలయంలో అందించే అన్ని రకాల సేవలపై రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన సిబ్బందికి, యువతకు అవగాహన కల్పించారు. డిఆర్‌డిఏ పిడి కె.సాంబశివారెడ్డి, జిల్లా ఉప ఖజానా అధికారి లోకేష్, ఆత్మా పీడీ దొరసానిలకుతపాలా శాఖ అధికారులు డాక్ చౌపల్ కార్యక్రమం వివరాలు తెలిపారు. డిఆర్‌డిఏ పిడి కె.సాంభశివారెడ్డి సహకారంతో పి. చెన్నయ్య ఆధ్వర్యంలో జిల్లా మహిళా సమాఖ్య సమావేశంలో తపాలా శాఖ అందిస్తున్న సేవింగ్ బ్యాంకు, రికరింగ్ డిపాజిట్,సుకన్య సమృద్ధి యోజన, టై డిపాజిట్లు, మంత్లీ ఇన్‌కం స్కీంలు, మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికేట్లు, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, ఇన్సూరెన్స్ స్కీంలపై అవగాహన కల్పించారు.



ఇఎస్ఐ డిస్పెన్సరీ నిర్వీర్యం..!

◆మందులుండవ్..డాక్టర్ల సేవలుండవ్..

◆రోజూ 30-40 మందే రోగులు

◆సిసి కెమెరాలు పెట్టి వైద్యం

కార్మికులకువైద్యసేవలందించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఎస్ఐ డిస్పెన్సరీ ప్రభుత్వం, అక్కడ పనిచేసే వైద్యులు నిర్లక్ష్యం కారణంగా నిర్వీర్యంగా మారుతోంది.. ఒకప్పుడు 100 నుంచి 150 మంది వచ్చే రోజుల సంఖ్య ప్రస్తుతం 30-40 మందికి పడిపోయింది. రోగులకు మందులు అందుబాటులో లేవు. డిస్పెన్సరీలో కనీస మౌలిక సదుపాయాలు లేవు. మరుగుదొడ్లు, మంచినీరు వసతి లేదు. డాక్టర్ల నిర్లక్ష్యం వైద్యం కనిపిస్తోంది. సిసి కెమెరాలు ఏర్పాటు చేసి వైద్యులు వైద్యసేవలు అందించడం పై రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల కోసం నిర్వహిస్తున్న ఇఎస్ఐ డిస్పెన్సరీలో మెరుగైన వైద్యసేవలు అమలు జరిగేలా చూడాలని రోగులు కోరుతున్నారు..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కార్మికుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం బీమా డిస్పెన్సరీ పేరుతో ఇఎస్ఐ ఆస్పత్రులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో పనిచేసే కార్మికుల జీతాల నుంచి ఇఎస్ఐ పేరుతో నగదు తీసుకుంటారు. కార్మికుల కటుంబాలకు వైద్యంతోపాటు మందులు అందిస్తారు. జిల్లా వ్యాపితంగా ప్రభుత్వ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ప్రయివేటు సంస్థల్లో పనిచేసే ప్రతి నెలా రూ.21వేల లోపు జీతం ఉన్న ఉద్యోగులు మత్రమే ఇఎస్ఐ వైద్యసేవలకు అర్హులు. అందరూ చిరుద్యోగులు, నిరుపేదలు కావడంతో ఎక్కువ మంది ఈ డిస్పెన్సరీపైనే ఆధారపడుతున్నారు. జిల్లా వ్యాపితంగా 15 వేల మంది వరకు కార్మికులు, చిరుద్యోగులున్నారు. ఇందులో అతితక్కువ మంది మాత్రమే ఇఎస్ఐ సేవలు అందుకుంటున్నారు. ఆర్యోగం సరిగా లేనప్పుడు సెలవు పెట్టినా జీతం అందజేశారు. కోవూరు, స్టాన్‌హౌస్‌పేట, ఎకె నగర్‌లో ఇఎస్ఐ డిస్పెన్సరీలున్నాయి. నెల్లూరు నగరంలో పొదలకూరు రోడ్డులోని డిస్పెన్సరీ నిర్వీర్యమవుతోంది. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 8 గంటల వరకు పనిచేస్తుంది. గతంలో ప్రతి రోజూ 150 మంది వరకు రోగులు వచ్చి వైద్యసేవలందుకునేవారు. ఇప్పుడు 30-40 మంది రోగులు రావడం లేదు. అందుకు ప్రధాన కారణంగా మందులు , ల్యాబ్‌లతోపాటు కనీస సదుపాయాలు కనిపించడం లేదు. రోగులు వచ్చినా వైద్యులు నిర్లక్ష్యంగా కనిపిస్తోంది. నలుగురు డాక్టర్లు ఉండగా అందులో ఒక మహిళా వైద్యురాల ున్నారు. సూళ్లూరుపేట నుంచి రెండ్రోజులకు ఒకరోజు మాత్రమే విధులకు వస్తున్నారు. ముగ్గురు పురుష డాక్టర్లు ఒకే గదిలో కూర్చొని పిచ్చాపాటి మాట్లాడ ుకుంటూ కాలం గడుపుతున్నారని, రోగులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూతూ మంత్రంగా వైద్యం అందిండంతో అప్పుడప్పుడు వచ్చే రోగులు సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది.



నెల్లూరు నగరంలోని ఇఎస్ఐ డిస్పెన్సరీలో మరుగుదొడ్ల దుస్థితి

ఇఎస్ఐలో దుర్గంధం..దుర్మార్గం..!

నగరంలోని ఏకె నగర్ ఇఎస్ఐ డిస్పెన్సరీలో పరిస్థితి చూస్తే సాధారణ ప్రజలు, రోగులు గొల్లు మంటున్నారు. మరుగుదొడ్లు లేవు. మహిళలు మూత్ర విసర్జనకు నానా ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు మట్టికొట్టుకు పోయాయి. మంచినీరు లేవు, కనీసం కుండల్లోనూ నీరు కనిపించడవు. కంపచెట్లు పెరిగిపోవడంతో ఎక్కడ చెత్త అక్కడే వేసి పాములు ఆసుపత్రుల్లోకి వస్తున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందుల విషయంలో ఎన్నో ఏళ్ల నుంచి నిర్లక్ష్యం కనిపిస్తోంది. దీర్ఘకాలిక రోగులు బిపి,. షుగర్ ఉన్నవారు, తమ కుటుంబ సభ్యులు ప్రతినెలా ఇఎస్ఐ మందులు తెచ్చుకుంటారు. వృద్ధులు ఇంటి నుంచి రాలేని పరిస్థితి ఉంటే మందులు ఇచ్చేవారు. ఇంట్లో ఉన్న రోగులను తీసుకొస్తేనే మందులు ఇస్తామని డాక్టర్లు మెలికపెడుతున్నారు. అత్యవసర కేసులొస్తే కొందరిని ఆటోల్లో ఆసుపత్రికి తీసుకొస్తే, అక్కడకే వచ్చి వైద్యులు అత్యవసరంగా చూశారు. రోగి ఏస్థితిలో వచ్చినా తన వద్దకే తీసుకురావాలంటూ కొందరు వైద్యులు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నట్లు రోగులు చెబుతున్నారు. ఒకే చోట వైద్యులుండడంతో రోగులు తమ సమస్యలను చెప్పుకోడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది. వైద్యులు తమ గదిలో మహిళలకు సేవలందిస్తారు. ఇక్కడ ఆ సమయంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి, మహిళా రోగులను చూస్తుండడంతో అనేక మంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోగులను చూసే సమయంలో డాక్టర్ గదిలో సిసి కెమెరాలు పెట్టుకోవాలని రూల్స్ లేకపోయినా ఇక్కడ ఎందుకు అమలు చేస్తున్నారో అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇఎస్ఐ డిస్పెన్సరీలో మెరుగైన వైద్యసేవల తోపాటు, మందులు, కనీస వసతులు, రోగులకు రక్షణ కల్పించేలా ఉన్నతాధికారుల ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. కార్మికులు, వారి కుటుంబం కోసం ఉన్న ఇఎస్ఐ నిర్వీర్యంగా కనిపిస్తోంది.దీనినిగాడిలో పెట్టాలని పలువులు కోరుతున్నారు.



ఆస్పత్రి ప్రాంగణంలోని చెత్తా చెదారాలు



డాక్టర్ల రూమ్‌లో సిసి కెమెరాలు ఉన్న దృశ్యం

నిరుద్యోగులకు కుచ్చుటోపి..!

డిఎం అండ్‌హెచ్‌ఒ సంతకం ఫోర్జరీ - పోలీసులు కేసు నమోదు

ప్రజాశక్తి-నెల్లూరు

వైద్యశాఖలో నిరుద్యోగులను బురిడి కొట్టించిన ఒక ఘనడు వారి వద్ద నుంచి భారీగా ముడుపులు తీసుకున్నారు. ఏకంగా జిల్లా వైద్యాధికారి సంతకం ఫోర్జరీ చేసి, ఉద్యోగం వచ్చినట్లు ఉత్తర్వులు సృష్టించారు. విషయం బయటకు రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి.నెల్లూరు నగర పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్సుల (పురుషులు) పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో అర్హులైన అభ్యర్థుల నియామకం చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో 2023 అక్టోబరులో 20 మందిని ఎంపిక చేసి నియామకపు ఉత్తర్వులు జారీ చేసింది. దీనిని అవకాశంగా తీసుకున్న చిత్తూరు జిల్లాకు చెందిన కరిముల్లా అనే వ్యక్తి తనకు వైద్య ఆరోగ్యశాఖలో అధికారులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, జిల్లాలో కొన్ని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పురుషుల విభాగంలో నర్సింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వారితో మాట్లాడి ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మ బలికి దళారి అవతారం ఎత్తారు. ఏడు మంది నిరుద్యోగుల వద్ద నుంచి లక్ష నుంచి రెండు లక్షల వరకు నగదు వసూలు చేశారు. డబ్బులు ఇచ్చిన వారికి ఈ ఏడాది ఫిబ్రవరి 29వ తేదీన జిల్లా వైద్యశాఖలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు నకిలీ పత్రాలు సృష్టించి అందజేశారు. ఈ క్రమంలో వెంకట కృష్ణ అనే వ్యక్తి తనకు మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్సుగా నియమిస్తూ ఉత్తర్వులు అందాయని, తనకు పోస్టింగ్ ఉత్తర్వులు అందజేయాలంటూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి వెళ్లారు. వెంకటకృష్ణ ఇచ్చిన పోస్టింగ్ ఉత్తర్వును పరిశీలించిన అధికారులకు అనుమానం వచ్చి, క్షుణంగా పరిశీలించగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టరు ఎం.పెంచలయ్య సంతకం ఫోర్జరీ చేసినట్లు అనుమానం బలపడటంతో ఈ విషయాన్ని సదరు అధికారి దృష్టికి తీసుకెళ్లారు. డిఎంహెచ్‌ఒ ఉద్యోగ నియామకపత్రం పరిశీలించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది నియామకం వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ స్థాయి అధికారి నియమించాలని, అయితే కలెక్టర్ ప్రొసీడింగ్స్‌తో ఉన్న ఈ ఉద్యోగ నియామకపత్రం నకిలీదని నిర్ధారించారు. అసలు విషయం తెలుసుకున్న వ్యక్తి తాను తీసుకొచ్చిన లెటర్‌ను అధికారుల వద్ద నుంచి లాక్కొని పారిపోయే ప్రయత్నం చేశారు. తాను మోసపోయానని, తానే కాకుండా మరి కొంత మంది ఇదే విధంగా మోసపోయామని, ఉద్యోగ అన్వేషనలో ఉన్న తమను కరిముల్లా అనే వ్యక్తి తన మాయ మాటలతో నమ్మించి నట్టేట ముంచాడంటూ అధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల సూచనల మేరకు మోసపోయిన వ్యక్తి సెల్‌ఫోన్ నుంచి ఉద్యోగ నియామకపత్రం అందజేసిన వ్యక్తికి ఫోన్ చేసి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి రావాలని కోరారు. సమాచారం తెలుసుకున్న కరిముల్లా డిఎంహెచ్‌ఒ కార్యాలయానికి వచ్చారు. సదరు వ్యక్తి ఏ మాత్రమూ భయపడకుండా డిఎంహెచ్‌ఒతో మాట్లాడే ప్రయత్నం చేయగా అసలు వ్యవహారం పూర్తిగా బయటకు వచ్చింది. కరోనా సమయంలో రోగులకు వైద్యసేవల ఒదించేందుకు అవసరమైన సిబ్బందిని అత్యవసర నియామకాలు చేపట్టాలని అప్పటి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ సమయంలో చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా హరినారాయణ్, ప్రస్తుత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టరు ఎం.పెంచలయ్యలు ఒకే ప్రాంతంలో విధులు నిర్వహించారు. . ఆ సమయంలో చేపట్టిన నియామకపత్రాల్లో ఒకటి కరిముల్లా చేతికి చిక్కింది. ఆ నియామక పుపత్రాన్ని సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అభ్యర్థుల పేర్లు, తేదీలను మార్పు చేసి కొంత మంది నిరుద్యోగులకు అందజేసి నగదు తీసుకున్నట్లు రుజువైంది. పోలీసు కేసు నమోదు చేసేందుకు ప్రయత్నం చేస్తున్న సమయంలో నగదు ఇచ్చి మోసపోయిన నిరుద్యోగులకు దళారి కరిముల్లా తాను తీసుకున్న నగదు తిరిగి ఇచ్చేస్తామని చెప్పి అక్కడ నుంచి వెళ్లిపోయారు.



డిఎంహచ్‌ఒ పెంచలయ్య

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను బలోపేతం చేసి లాభాల బాటలో నడిపించేందుకు కషిచేయాలని జాయింట్ కలెక్టర్ సూర్యతేజ ఆయా సంఘాల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని గాంధీబొమ్మ వద్ద గల నెల్లూరుజిల్లా సహకార కేంద్రబ్యాంకులో మహాజన సభ సమావేశం జాయింట్ కలెక్టరు సూర్యతేజ అధ్యక్షతన నిర్వహించారు. బ్యాంకు సిఇఒ ఎస్ శ్రీనివాసరావు మహాజన సభ చర్చనీయాంశాలను చదివి వినిపించారు. డిసిసి బ్యాంకు నెల్లూరు 2023-24 వార్షిక నివేదిక, లాభనష్టాల ఖాతా, ఆడిటింగ్ పట్టికలు, 80 పిఎసిఎస్ సభ్య సంఘాల పనితీరును వివరించారు. జేసీ సూర్యతేజ మాట్లాడుతూ నష్టాల్లో వున్న 51 పిఎసిఎస్ సంఘాల నులాభాలబాటలో తీసుకురావడానికి ప్రణాళికలు తయారుచేయాలని సూచించారు. జిల్లా సహకార శాఖ అధికారి గుర్రప్ప, నాబార్డు జిల్లా మేనేజర్ బాబు, సహకారశాఖ అధికారులు రాజా రవిశేఖర్, తిరుపతయ్య, అంజిరెడ్డి, సరిత, డిసిసి బ్యాంకునకు అనుబంధంగా వున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సూర్యతేజ

జెండా పండుగను జయప్రదం చేద్దాం..!

ప్రజాశక్తి - నెల్లూరు సిటీ : ఆజాదీకా అమత మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్ధేశించి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ పిలుపునిచ్చారు. స్థానిక విఆర్‌సి మైదానం నుంచి గాంధీ బొమ్మ కూడలి వరకు స్వాతంత్ర దినోత్సవ మహోత్సవ ర్యాలీని బుధవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడు తూ ఈ నెల 2 నుంచి 13 వరకు జరగనున్న స్వాతంత్ర్య మహోత్సవాల్లో భాగంగా నగర పాలక సంస్థ పరిధిలోని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా కార్యక్రమాలను రూపొందించి పర్యవేక్షిస్తున్నామన్నారు. జిల్లా అధికారులు డాక్టర్ పెంచలయ్య, మలోల, కన్నమ నాయుడు, వెంకటయ్య, ప్రజా ప్రతినిధులు, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు తదితరులు ఉన్నారు.



నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించండి..!

ప్రజాశక్తి-కందుకూరు : త్వరలో ప్రకటించనున్న నామినేటెడ్ పదవుల్లో టిడిపి కోసం అహర్నిశలు పనిచేసినవారికి అవకాశం కల్పించాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి కోరినట్లు నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే తెలిపారు. స్పందించిన హోంమంత్రి అనిత టిడిపి కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీని అధికారంలోకి తీసుకురావడం కోసం 2019 నుంచి 2024 వరకు కుటుంబాలను సైతం పక్కనపెట్టి శాయశక్తుల కష్టపడి పనిచేసిన వారిని గుర్తించి వారికి పదవులను ఇవ్వాలని సిఎం చంద్రబాబు కసరత్తు చేస్తున్నారని హోంమంత్రి తెలిపినట్లు మోషే తెలిపారు.గత ప్రభుత్వంలో టిడిపి కార్యకర్తలు, నేతలపై అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరినట్లు మోషే తెలిపారు. టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోనా ప్రతాప్ కుమార్ , ఉలవపాడు మండలం తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం నవీన్ ఉన్నారు.



హోంమంత్రి అనితను కలిసిన మోషే

టిడిపిలో చేరిన గుడ్లూరు సర్పంచ్

ప్రజాశక్తి-కందుకూరు : వైసిపి మద్దతుతో గెలిచిన గుడ్లూరు మండలంలోని కర్లపాలెం, చినలాటరిపి సర్పంచులు లెంఎల్ఎ నాగేశ్వరరావు సమక్షంలో టిడిపిలో చేరారు. వారి బాటలోనే మరో వైసిపి సర్పంచ్ పాలకీర్తి శంకర్ (గుడ్లూరు), బుధవారం ఎంఎల్ఎ సమక్షంలో టిడిపిలో చేరారు. సర్పంచ్ తోపాటు 3వ వార్డు మెంబర్ పాలకీర్తి మురళి, పాలకీర్తి బ్రహ్మయ్య, రాజశేఖర్, సురేష్, సుబ్రహ్మణ్యం, సుబ్బారావు, పేరం సుబ్బారావు, వెంకటేశ్వర్లు, పెద వెంకటేశ్వర్లు, దేవరకొండ చిన్న వెంకయ్య, చినలాటరిపి గ్రామానికి చెందిన మొగిలి ఆంజనేయులు పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కేవలం నియోజకవర్గ అభివద్ధి, ప్రజాప్రయోజనాలే తనకు ముఖ్యమని, అదే లక్ష్యంతో తమ ప్రభుత్వం ముందుకు వెళుతోందని నాగేశ్వరరావు ఈ సందర్భంగా తెలిపారు. గుడ్లూరు గ్రామ అభివద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కందుకూరు లోని ఆఫీస్‌లో జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శి దామా వెంకటేశ్వర్లు, తెలుగు మహిళ అధ్యక్షురాలు జొన్నలగడ్డ రవణమ్మ, పార్టీ నాయకులు పువ్వాడి వేణు, మేకపోతుల రాఘవయ్య, జంపాని ప్రసాద్, కోకా చిరంజీవి, చిత్తారి మల్లికార్జున ఉన్నారు.



ఎంఎల్ఎ 'ఇంటూరి' సమక్షంలో టిడిపిలో చేరిన గుడ్లూరు సర్పంచ్ శంకర్

నేడు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాక

వెంకటాచలం :మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు నెల్లూరు పర్యటన ఖరారైంది. స్వర్ణభారత్ ట్రస్ట్ సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆయన నెల్లూరు రానున్నట్లు కార్యాలయం తెలిపింది. ఈనెల 8న ఆయన నెల్లూరు చేరుకుంటారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం ఆయన తిరిగి ఈనెల 19న హైదరాబాద్ వెళ్తారు.

జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-నెల్లూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను చేనేత కార్మికులకు అందించేందుకు కషి చేస్తున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను విరివిగా ధరించి చేనేత కార్మికులకు అండగా నిలవాలన్నారు. పిఎంఈజీపీ, క్లస్టర్ డెవలప్‌మెంటు ప్రోగ్రాం, ప్రధానమంత్రి బిజిలీ యోజన సంక్షేమ పథకాలను చేనేతలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిపుష్టి సాధించాలని సూచించారు. అనంతరం చేనేత వస్త్రాల గొప్పతనం తెలుపుతూ చేనేత కార్మికులు నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. తదుపరి టౌన్‌హాలులో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎంఎల్‌సి బూదాటి రాధయ్య, జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి వరప్రసాద్, బిసి వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, జిల్లా సహకార అధికారి గుర్రప్ప, దేవాంగ సమితి నాయకులు మన్నెం సతీష్, శంకరయ్య, పముజుల రవి, చేనేత సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఓ ఆనంద్

మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి : బిటిఎ

ప్రజాశక్తి-కందుకూరు : మండల్ కమిషన్ నివేదికలోని అంశాలన్నింటిని అమలు చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్(బిటిఎ) రాష్ట్ర గౌరవాధ్యక్షులు కల్లగుంట మోహన్ రావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. మండల్ కమిషన్ నివేదిక సమర్పించి 45 ఏళ్లు అయిన సందర్భంగా కందుకూరు బిటిఏ డివిజన్ బుధవారం కార్యాలయంలో నిర్వహించిన మండల్ డే కి ముఖ్య అతిథిగా హాజరై మోహనరావు మాట్లాడారు. మండల్ కమిషన్ చైర్మన్ బిందెశ్వరి ప్రసాద్ మండల్ సుదీర్ఘ విచారణ అనంతరం తన యొక్క నివేదికలో బిసిలకు సంబంధించిన నలభై అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి తన నివేదికను 1980లో సమర్పిం చారన్నారు. . దాదాపు పదేళ్ల పక్కనపెట్టిన కేంద్ర ప్రభుత్వాలు 1990లో వి పి సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మండల్ కమిషన్ అమలకు నిర్ణయం తీసుకున్నప్పటికీ విద్యా ఉద్యోగాలలో మాత్రమే రిజర్వేషన్ 27శాతం కల్పిస్తూ ఒకే అంశాన్ని మాత్రమే అమలకు నిర్ణయం తీసుకున్నారంటు మొత్తం నివేదికలోని అంశాలన్నింటినీ అమలు చేయటానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాలని కోరారు. డివిజన్ అధ్యక్షులు షేక్ అబ్దుల్లా, . లింగసముద్రం మండల ప్రధాన కార్యదర్శి పర్రే వెంకట్రావు మాట్లాడారు. సీనియర్ నాయకులు టి గంగయ్య అధ్యక్షతన జరిగిన ఈనాటి మండల్ డే కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కొచ్చర్ల వెంకటేశ్వర్లు కొప్పులు ఆదాము కరేటి వెంకటేశ్వర్లు సన్యాసి మాల్యాద్రి బాంసప్ వెంకట్రావు ఉన్నారు.



మండల్ డే వేడుకల్లో బిటిఎ నాయకులు



మాట్లాడుతున్న జనసేన నాయకులు

పార్టీ బలోపేతానికి కృషి : జనసేన

ప్రజాశక్తి-నెల్లూరు : సభ్యత్వం పెంపుద్వారా పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నట్లు జనసేన పార్టీ ఆ పార్టీ సీనియర్ నేత నూనె మల్లికార్జున యాదవ్ తెలిపారు. గురువారం స్థానిక గోమతి నగర్‌లోని జనసేన కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు జనసేన పార్టీకి 36వేల సభ్యత్వం నమోదు చేశామన్నారు. జనసేన పార్టీలోకి చేరికలు జరుగుతున్నాయన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పై ప్రజల్లో సంపూర్ణ విశ్వాసం ఉందని పేర్కొన్నారు. జనసేన పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్ సారధ్యంలో పార్టీ పటిష్టమవుతుందన్నారు.తాను 2 వేల మందికి పైగా సభ్యత్వాలు స్వీకరించినట్లు నగర పరిధిలో గునుకుల కిషోర్ వెయ్యి మందికి పైగా సభ్యత్వం చేర్పించారన్నారు.ఉదయగిరి ప్రాంతానికి చెందిన మురళీకష్ణ, నాగిశెట్టి, బోగినేని కాసిరావు, సర్వేపల్లి నియోజకవర్గం పరిధిలో బోనుబోయిన ప్రసాద్ సభ్యత్వం నమోదు చేయించారన్నారు. కోర్ కమిటీ సభ్యులు,జమీర్, లాయర్ శ్రీరామ్, కష్ణా రెడ్డి, రవి, జనసేన నాయకులు, వీరమహిళలు పాల్గొన్నారు.

గుడ్లూరులో మోస్తరు వర్షం

ప్రజాశక్తి-గుడ్లూరు : బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా గుడ్లూరులో మంగళవారం రాత్రి బుధవారం వేకువ జామున వర్షం కురిసింది. స్థానిక సచివాలయం, ఎంఇఒ కార్యాలయం దగ్గర వర్షపు నీరు నిలిచిపోయింది. సైడ్ కాలవలు పూడిపోవడంతో వర్షపు నీరు పోయే వీలు లేక నిలిచిపోయింది.

రాజకీయ జోక్యాన్ని నివారించాలి

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే తల్లిదండ్రుల కమిటీ ఎన్నికల్లో రాజకీయ ప్రమేయం లేకుండా నిర్వహించాలని, ఈ కమిటీపై రాజకీయ నాయకుల ఒత్తిళ్ల తీసుకురావడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావును కలిసి పభుత్వ పాఠశాలలో జరిగే తల్లి తండ్రుల కమిటీ ఎన్నికలలో రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అంద జేశారు. గత ప్రభుత్వం తీసుకొని వచ్చిన జి ఓ నెం 117ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి, సిరివెళ్ళ నరేష్, స్వర్ణ రాజశేఖర్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు యామల రాజా, సాయికష్ణ హమీద్ లు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నేటి నుంచి సర్పంచులకు శిక్షణ

తోటపల్లిగూడూరు :గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు, కార్యదర్శులకు నేటి నుంచి మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వ హిస్తున్నట్లు ఎంపిడిఒ బాలాజీ, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి గీతా లలిత కుమారి బుధవారం తె లిపారు. పారిశుధ్య నిర్వహణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, ఘన వ్యర్థాల నిర్వహణ, గ్రామ పంచాయ తీ అభివద్ధి ప్రణాళికలు, ఎల్ఈడి లైట్స్, వీధి దీపాల ఏర్పాటు నిర్వ హణ తదితర అంశాలపై సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంపీడీఓ కా ర్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 8, 9, 10 తేదీ లలో ఈ శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు

కంపచెట్లు తొలగించరూ..!

ప్రజాశక్తి -వలేటివారిపాలెం :మండలంలోని చుండి, అయ్యవారిపల్లె, వలేటివారిపాలెం, అంకభూపాలపురం, లింగపాలెం తదితర గ్రామాలలోని మాగాణి భూముల్లోకి వెళ్లే డొం కరోడ్లు చిల్లచెట్లతో మూసుకపోయి అద్వానంగా తయారయ్యాయి. గ్రామాల్లో నుండి మాగాణి భూముల్లోకి వెళ్లాలంటే సుమారు 2 కిలోమీటర్లు ఉంటుంది. అద్వానంగా ఉన్న డొంక రోడ్లలో వెళ్లాలి. ప్రస్తుతం ఎడ్ల బండ్లు లేవు, విత్తనాలు, ఎరువులు ఆటోలు, ట్రాక్టర్లలోనే తీసుకెళ్లాలి. దీంతో పంటలు సాగు చేసే సమయాలలో రైతులు ఇబ్బం దులు పడుతున్నారు. పంట విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పిచికారి చేసే సమ యాలలో రైతులు అద్వానంగా డొంక రోడ్లలో వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డొంకరోడ్లకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



వలేటివారిపాలెంలో చిల్లచెట్లతో మూసుకపోయిన రోడ్డు

తహాశీల్దార్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-గుడ్లూరు : గుడ్లూరు మండలం తహాశీల్దార్‌గా జి స్వర్ణ బుధవారం విధుల్లో చేరారు. స్థానిక రెవెన్యూ ఉద్యోగులు ఆమెకి స్వాగతం పలికారు. రైతులు సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తామన్నారు.

కందుకూరు తహాశీల్దార్‌గా ఇక్బాల్

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు తహాశీల్దార్‌గా బుధవారం సయ్యద్ ఇక్బాల్ బాధ్యతలు స్వీకరించారు.గత కొన్ని నెలలుగా కందుకూరు తాసీల్దార్ పోస్టు ఖాళీగా వుంది.ఇన్‌చార్జుల పాలనలో కోనసాగింది.కొత్త ప్రభుత్వం ఎర్పడిన తరువాత కొత్త తాసీల్దార్‌ను నియమించడంతో ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు.




విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం,ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - లింగసముద్రం : లింగసముద్రంలోని కమ్మిశెట్టి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు సాఫ్ట్ బాల్ ఆటలో రాణించడంతో రాష్ట్ర స్థాయి ఆటలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమ్మడిశెట్టి మాధవరావు తెలిపారు. బుధవారం రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన వెంకటేష్, ప్రతిమలను పాఠశాలలో ప్రధానో పాధ్యా యులు, ఉపాధ్యాయులు అభి నందించారు. ఈనెల 6న ఒంగోలులోని ఏబీఎం కాలేజీ గ్రౌండ్ లో జరిగిన జిల్లా పోటీలలో సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఎంపికలకు పాఠశాల నుండి వారిద్దరూ ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు కొండయ్య,పిఈటి మంగతా యారమ్మ ఉన్నారు.

కందుకూరు వాసికి డాక్టరేట్

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోని బృందావనానికి చెందిన శీలం అమర్‌నాథ్‌కు గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. డాక్టర్ హసన్ గైడెన్స్‌లో చేసిన పరిశోధనపై శీలం అమర్‌నాథ్‌కు డాక్టరేట్ లభించింది. అమరనాథ్ మాట్లాడుతూ డాక్టర్ డి హసన్‌కు కతజ్ఞతలు తెలిపారు. లక్ష్మయ్య దివి రమేష్ ఎం శివప్రసాద్ డాక్టర్ టి అనూష డాక్టర్ బసవశంకర్ తదితరులు అభినందనలు తెలిపారు.



డాక్టరేట్ పొందిన శీలం అమర్‌నాథ్

పలుచోట్ల తహశీల్దార్లు బాధ్యతలు స్వీకరణ



ప్రజాశక్తి-ఉదయగిరి : ఉదయగిరి నూతన తహశీల్దార్‌గా ఎం.సుభద్ర బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఆత్మకూరు ఆర్‌డిఒ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఎన్నికల నేపథ్యంలో బాపట్ల జిల్లాకు బదిలీపై వెళ్లామన్నారు. ఎన్నికల అనంతరం సాధారణ బదిలీలో భాగంగా ఉదయగిరి తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టడం జరిగిందన్నారు. మండలంలోని రెవెన్యూ సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే సత్వర పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. ముందుగా సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం సిబ్బందితో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మండల తహశీల్దార్‌గా వి.సుధీర్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన బుచ్చిరెడ్డిపాలెంలో విధులు నిర్వహిస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లాకు బదిలీ కాబడ్డారు. ప్రస్తుతం ఆత్మకూరు తహశీల్దార్‌గా వి.సుధీర్‌బాబు బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆత్మకూరు టిడిపి నాయకులు తహశీల్దార్‌ను కలిసి బొకే అందజేశారు. ఆయనను కలిసిన వారిలో టిడిపి నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, తెలుగు యువత నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, టిడిపి నాయకులు జయకర్, గిరి షబ్బీర్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ఎఎస్‌పేట మండల తహశీల్దార్‌గా డి.శ్రీరామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన కె.రవికుమార్ ఎన్నికల పూర్వం సొంత జిల్లాకు వెళ్లడంతో పల్నాడు జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించి సొంత జిల్లాకు వచ్చిన శ్రీ రామకృష్ణను కలెక్టర్ ఎఎస్‌పేట తహశీల్దార్‌గా నియమించారు.

ప్రజాశక్తి-సంగం : తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం నూతన తహశీల్దార్‌గా బి.సోమ్లానాయక్ బాధ్యతలు చేపట్టారు. ముందుగా పూజలు నిర్వహించి సీట్లో కూర్చున్నారు. అనంతరం సంతకం చేసి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్‌కు డిప్యూటీ తహశీల్దార్ సుభాషిణి, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాజ నారాయణ, విఆర్‌ఓలు పాల్గొన్నారు.

డాక్టర్ మధుకు సేవారత్న పురస్కారం

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణానికి చెందిన ఆర్.ఎం.పి. వైద్యులు దామ మధుసూదన రావుకి గత ఆదివారం శ్రీకాకుళంలోని యువతరం సేవ సమితి వారి హెల్ప్ హోమ్‌లో విశాఖపట్నం, తాసుబెల్లి ఫౌండేషన్ అధ్యక్షుడు శంకర్ నాయుడు ఆధ్వర్యంలో భారత సేవారత్న అవార్డ్ అందజేశారు. ఈ సందర్భంగా గ్రామీణ వైద్యుల ఆధ్యాత్మిక సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు దామ మధుసూదన రావు మాట్లాడుతూ తమ సంస్థ చేసే సేవా కార్యక్రమాలను గుర్తించి భారత సేవారత్న అవార్డు అందజేసినందుకు శంకర్ నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. అవార్డుకు ఎంపిక చేసిన తాసుబెల్లి ఫౌండేషన్ సభ్యులకు సొసైటీ సభ్యులు లక్ష్మీ కృతజ్ఞతలు తెలిపారు.




వ్యాధుల నివారణపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-అనంతసాగరం : స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా పారామెడికల్ వైద్య శాఖ డిపార్ట్‌మెంట్ వారు అలాగే అనంతసాగరం ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ వారి సిబ్బందితో బుధవారం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు లెప్రసీ, టిబి, ఎయిడ్స్, హెచ్‌ఐవి వ్యాధి నివారణపై పిల్లలందరికీ కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ మోహన్ అలాగే పిహెచ్‌సి అనంతసాగరం మెడికల్ ఆఫీసర్ అలాగే వాళ్ళ సిబ్బంది అలాగే ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీప్రసన్న పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు పరిశీలన

ప్రజాశక్తి-కోవూరు : రైతులు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి కోరారు. మండలంలోని పాటూరు, గుమ్మళ్లదిబ్బ, ఇనమడుగు గ్రామాల్లో బుధవారం ఈ పంట నమోదును పరిశీలించారు. ఈ పంట నమోదుపై ఏమైనా సాంకేతిక పరమైన ఇబ్బంది లేమైనా ఉన్నాయని ఆరాతీశారు. జిల్లా వ్యవసాయాధికారి వ్యవసాయ సంకాలకులు ఈ నర్సోజి, శేషగిరి గాళ్లు, కోవూరు సహాయ వ్యవసాయ శాఖ ఎడి సుజాత, ఎఒ ఇందిరావతి, గ్రామ వ్యవసాయ సహాయకులు మోహనప్రియా చైతన్య, స్వేత లీల, మేనిక, మోళీ పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగింపు



ప్రజాశక్తి-మర్రిపాడు : మండల కేంద్రంలోని మిక్స్‌డ్ కాలనీలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంపచెట్లను జెసిబి సహాయంతో బుధవారం తొలగించారు. వర్షాలకు చెట్లు ఏపుగా పెరగడంతో రాత్రి సమయంలో ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. టిడిపి యువ నాయకులు మువ్వా వెంకట్ చౌదరి తనసొంత నిధులు వెచ్చించి ముళ్ల చెట్లను తొలగించారు. కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు ప్రసాద్ నరేష్, చిరంజీవి,పవన్, చిన్నా జనసేన పాల్గొన్నారు.

'జామాయిల్' పట్టివేత

- అధికారుల అదుపులో లారీ



ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని సర్వరాబాదు గ్రామ సమీపంలో ఉన్న 1284 సర్వే నెంబర్ జిల్లా రెవెన్యూ కోర్టులో ఉన్న భూమిలోని కొందరు వ్యక్తులు అక్రమంగా జామాయిల్ పంటను నరికి తరలిస్తున్న నేపథ్యంలో వారు కట్ల తరలింపును అడ్డుకుని లారీని స్వాధీనం చేసుకున్నారు. వివరాల మేరకు.. రెవెన్యూ కోర్టులో ఉన్న భూమిలో సుమారు ఐదు సంవత్సరాల జామాయిల్ పంట ఉండడం గమనించిన అక్రమార్కులు పంటను నరికి తరలించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. గత వారం రోజులుగా పరిసర ప్రాంతాల్లో ఉన్న జామాయిల్ కర్రను నరికి ఒక లారీలో తరలిస్తూ ఉండడంపై ఆ గ్రామంలో కొంత అనుమానం వ్యక్తం అయింది. యథావిధిగా రెవెన్యూ కోర్టులో ఉన్న భూమిలోకూడా చెట్లు నరికి తరలించే క్రమంలో గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు సదరు స్థలానికి చేరుకొని పోలీసుల సహకారంతో లారీని అదుపులోకి తీసుకున్నారు. రెవెన్యూ అధికారులతో పాటు అటవీ శాఖ అధికారులు కూడా సంఘటన స్థలానికి చేరుకొని సర్వే నెంబరు ధ్రువీకరించారు. రెవెన్యూ అధికారులు పోలీసులు వస్తున్నారన్న సమాచారం రాగానే లారీ వదిలేసి డ్రైవర్ సిబ్బంది పరారయ్యారని విశేషం. గత 4సార్లుగా ఇలా తరలిపోతున్నారని సమాచారంతో వెళ్లడం వెనుదిరగడం ముందుగా పట్టబడిన లారీలను సిబ్బంది వదిలేయడంతో రెచ్చిపోయిన అక్రమార్కులు పట్టుబడ్డారు. ఇప్పటికైనా ఈ అక్రమ రవాణా అడ్డుకట్ట వేసి, జామాయిల్ రవాణా వెనక ఎవరు ఉన్నారనేది అధికారులే తేల్చాలి.

మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-కోవూరు : మానవుని మనుగడకు మొక్కలు ఎంతో ముఖ్యమని గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సందీప్‌కుమార్ తెలిపారు. ఎన్.ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సందీప్‌కుమార్, కళాశాల సెక్రటరీ ఎన్.సుధాకర్ రెడ్డి కార్పొరేట్ సామాజిక బాధ్యతతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వై.మురళీకృష్ణ పర్యవేక్షించారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి-ఉదయగిరి : హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్న మండల అభివృద్ధి అధికారి డి.ఈశ్వరమ్మ, విద్యాశాఖ అధికారి తోట శ్రీనివాసులు పాల్గొన్నారు. బుధవారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయం నుండి స్థానిక బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులు సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శులు, ఎంఐఎస్ దరివాడ ప్రధానోపాధ్యాయులు షేక్ షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని మండలం ఎంఇఒ-2 కటారెడ్డి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా మండల కేంద్రమైన అనంతసాగరంలోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టెర్డి లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో హైస్కూల్ నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీగా బయల్దేరి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మొలకూరు సుబ్బారెడ్డి, పోలంరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కేత సుబ్బారెడ్డి, కేత శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రిఫ్రెషర్ శిక్షణ

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల స్థాయి రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమం గురువారం నుండి మూడు రోజులు పాటు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ డి.ఈశ్వరమ్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లో శానిటేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జెజెఎం, వీధిదీపాల నిర్వహణ పనులపై కార్యదర్శులకు సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం జరుగుతుందని, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి శానిటేషన్ మంచినీరుకు తప్పనిసరిగా 60శాతం ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు అక్రమం

యూనియన్ల ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాలు అందజేత



వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

అక్రమంగా ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లను తొలగించొద్దని, నిబంధనలకు వ్యతిరేకంగా బయటి వారికి లాగిన్ ఇచ్చి పని చేయించే పద్ధతులను విరమించుకోవాలని సిఐటియు మండల అధ్యక్షులు ఎస్‌కె చాన్‌బాషా పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో బుధవారం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ సభ్యులు ఇందుకూరుపేట ఉపాధి హామీ ఎపిఒ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చాన్‌బాషా మాట్లాడుతూ మండలంలో 18మంది ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు గ్రామాల్లో పని చేస్తున్నారని తెలిపారు. వారిలో కొంతమంది దాదాపుగా 10 సంవత్సరాల నుండి పని చేస్తున్నారన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుండి ఎలాంటి సంజాయిషీలు అడగకుండా రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు వారిని తొలగించమని చెప్పడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ ఫీల్డ్ అసిస్టెంట్‌లను మార్చే విధానం మంచిది కాదన్నారు. గత వైసిపి ప్రభుత్వం చేసిన పనులనే ప్రస్తుత అధికార పార్టీ వారు చేస్తున్నారన్నారు. అధికార పార్టీ వారికి ఉద్యోగాలు ఇవ్వాలంటే ఉన్న ఉద్యోగాల్లో పని చేస్తున్న వారిని తొలగించి వారి మనుషులను పెట్టుకోవడం సరికాదన్నారు. తొలగిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తిరిగి తీసుకోవాల న్నారు. లేని పక్షంలో సిఐటియు ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతంగా నిర్వహిస్తామని హెచ్చ రించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు దయా సాగర్, ఫీల్డ్ అసిస్టెంట్లు వెంకయ్య బాబు, గున్నం కిషోర్, పవన్, నామ్ కుమార్, మహేశ్వరీ, సుబ్రమణ్యం, ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లను అక్రమంగా తొలగించొద్దని కోరుతూ సిఐటియు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఎంపిడిఒ, ఉపాధి హామీ ఎపిఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి అన్వర్ బాషా మాట్లాడుతూ మండలంలో 25మంది ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లుగా గ్రామాల్లో పని చేస్తున్నారన్నారు. వారిలో కొంత మంది దాదాపుగా 10సంవత్సరాల నుండి పని చేస్తున్నారని తెలిపారు. వీళ్ళ నుండి ఎలాంటి సంజాయిషీలు అడగకుండా రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు తొలిగిస్తున్నామని చెప్పడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వాలు మారిన ప్రతి సారి ఫీల్డ్ అసిస్టెంట్ లను మార్చే విధానం మంచిది కాదన్నారు. గత వైసిపి ప్రభుత్వం చేసిన పనులనే ప్రస్తుత అధికార పార్టీ వారు చేస్తున్నారన్నారు. అనధికారికంగా లాగిన్‌లు ఇచ్చిన వారి నుండి లాగిన్‌లు తొలగించి, మొదటి నుండి పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ లకు లాగిన్‌లు ఇచ్చి గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేయించాలన్నారు. తొలగిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తిరిగి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఖాజా మొహిద్దీన్, సంపూర్ణ, చిరంజీవి, పెంచాల ప్రసాద్, రమేష్, మహీంద్రా, సుబ్బారెడ్డి, షబ్బీర్, పెంచల నరసింహులు, చిన్నయ్య, పెంచలయ్య, వెంకట రామయ్య, సాంబశివ, వెంకటరమణ, శ్రీహరి, సుబ్బరాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు



గురుకుల పాఠశాలలో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు స్థానిక మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా బుధవారం బోర్‌ను వేయించారు. ఇటీవల మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి పర్యటనలో భాగంగా పట్టణంలోని మినీ బైపాస్ వద్ద ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో పర్యటించారు. ఆ సందర్భంలో బాలికలు మంచినీటికి ఇబ్బందులు పడుతున్నామని మంత్రిని వేడుకోవడంతో వెంటనే స్పందించి మంచినీటి కొళాయిని ఏర్పాటు చేస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం బోరువేయించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు విద్యార్థులు మంత్రి ఆనంకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కృషి విజ్ఞాన కేంద్రం స్వర్ణోత్సవాలు



ప్రజాశక్తి-మర్రిపాడు : గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రంలో కృషి విజ్ఞాన కేంద్రాలు స్థాపించి 50యేళ్లు పూర్తయిన సందర్భంగా జ్యోతియాత్ర నిర్వహిస్తున్నట్టు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ లలిత శివజ్యోతి తెలిపారు. నెల్లూరులో కృషి విజ్ఞాన కేంద్రానికి గురువారం స్వర్ణోత్సవ జ్యోతి కె.వి.కె. ఊటుకూరు నుంచి చేరుకుంటుందన్నారు. కె వి కె హెడ్ డాక్టర్ లలిత శివజ్యోతి అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయ ప్రధాన అంశంగా అవగాహన కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వావిద్యాలయం విస్తారం సంచాలకులు డాక్టర్ ప్రమీల రాణి, ఉప విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.ముకుందరావు, సదరన్ జోన్ అసోసియేట్ డైరెక్టర్ అఫ్ రీసెర్చ్ డాక్టర్ వి.సుమతి హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రకతి వ్యవసాయం చేస్తున్న రైతులకు కషాయాలు తయారు చేస్కోడానికి ప్లాస్టిక్ డ్రమ్ములు పంపిణీ చేశారు. అలాగే నిమ్మపంటను సాగు చేస్తున్న షెడ్యూల్డ్ కులాల రైతులకు ఐదుగురు ఉన్న సంఘానికి, 04 సంఘాలకు ఒక్కొక్క స్ప్రేయర్ అందజేశారు. అలాగే ఆక్వా రైతులకు ఏరేటర్‌లు కూడా పంపిణీ చేశారు. రైతులు అందరు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే కృషి విజ్ఞాన కేంద్రం నెల్లూరు స్థాపనై 25సంవత్సరాలు అయిందని రైతులకు ఎంతగానో కృషి చేసిందని రైతులు అతిథులు ఎంతగానో కొనియాడారు. డాక్టర్ ఓబయ్య, డాక్టర్ వినీత, రైతుసంఘం అధ్యక్షులు కోటిరెడ్డి, కృషి విజ్ఞాన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

నవధాన్యాలతో భూమి సారవంతం



ప్రజాశక్తి-ఉదయగిరి : భూమి సారవంతం మరింత వృద్ధి సాధించేందుకు జీలుగులతో పాటు నవధాన్యాలు కూడా వినియోగించాలని ప్రకృతి వ్యవసాయ అధికారి తేజ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఆవరణంలోని రైతుభరోసా కేంద్రంలో సిబ్బందితో ఆయన నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు లబ్ధి చేకూరే అంశాలు సూచనలు సలహాలు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ వ్యవసాయ ప్రోత్సాహం కలిగించాలన్నారు. ఆశీర్వాదం, రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.



స్థల పరిశీలన చేపడుతున్న ఆర్‌డిఒ మధులత

స్థల పరిశీలన

ప్రజాశక్తి-సంగం : సంగంలోని తిరమనతిప్ప కొండపై వాటర్ ట్యాంక్ ఏర్పాటుకు బుధవారం ఆర్‌డిఒ మధులత స్థల పరిశీలన చేశారు. పెన్నానది నుండి బుచ్చిరెడ్డి పాలెంకు వెళ్ళే వాటర్ స్కీమ్‌కు సంబంధించి పెద్ద వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో కాంట్రాక్టర్లు స్థలం కోసం అర్జీ సమర్పించారు. ఈ నేపథ్యంలో కొండపైన స్థలాన్ని ఆర్‌డిఒ పరిశీలించారు. అందుకు సంబంధించిన రికార్డులు పరిశీలించి, అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సోమ్లా నాయక్, ఆర్‌ఐ రాజ నారాయణ, సర్వేయర్ శాంత కుమారి, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

ఎరుకలయ్య సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-మర్రిపాడు

జీవితాంతం ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకొని అలుపెరగని పోరాటాలు చేసిన సిపిఎం నాయకులు ఎరుకలయ్య గొప్ప కమ్యూనిస్టు యోధుడని వారి సేవలు మరువలేనివని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య పేర్కొన్నారు. ఎరుకులయ్య 5వ వర్ధంతి సందర్భంగా స్వగ్రామం ఇసుకపల్లిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమశిల హైలెవెల్ కెనాల్ సాధన కోసం నిరాహార దీక్షలు, పాదయాత్రలు చేశారని, అప్పట్లో మద్యపాన నిషేధం కోసం అలుపెరగని పోరాటం చేశారన్నారు. వ్యకాసం తరపున వ్యవసాయ కూలీలకు పనికి తగ్గ వేతనం అందేలా వారి తరపున అనేక ఉద్యమాలు చేపట్టారని తెలిపారు. గ్రామంలో పేదలకు సరైన గృహాలు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో దివంగత అల్లూరు మాజీ ఎంఎల్‌ఎ కమ్యూనిస్టు యోధులు జక్కా వెంకయ్య సహకారంతో ఆయన కోటాకింద ఇసుకపల్లి గ్రామానికి 47 గృహాలను మంజూరు చేయించారన్నారు. భూములు లేని నిరుపేదల కోసం భూమి పట్టాలు మంజూరు కోసం ఉద్యమం చేశారన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు బత్తల కృష్ణయ్య, సిపిఎం మండల కార్యదర్శి ఎస్‌డి రహమతుల్లా, సిఐటియు మండల కార్యదర్శి బత్తల రత్నయ్య, నందవరం సిపిఎం నాయకులు మహమ్మద్ గౌస్, చిన్నమాచనూరు శాఖ కార్యదర్శి పోలిరెడ్డి, ప్రభాకర్, పోలయ్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

పేదలకు మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

పేద ప్రజలకు వైద్య సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి జె.అంజయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని గంగిరెడ్డి పల్లెలో జరుగు మెడికల్ క్యాంపులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు నాణ్యమైన మెరుగైన వైద్యసేవలు అందించేందుకు న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో ఈ మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశామన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అంటువ్యాధులపై నిర్లక్ష్యం వహించకుండా వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆయన సూచించారు. ప్రతిఒక్కరూ చట్టాల పైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడుతూ సురక్షిత ప్రయాణాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, గండిపాలెం పి.హెచ్.సి. వైద్యాధికారిని శివ కల్పన, సర్పంచ్ వరలక్ష్మి, శ్రీరాములు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జె అంజయ్య

హెచ్‌ఐవి నివారణపై సదస్సు

ప్రజాశక్తి-విడవలూరు

మండలంలోని దంపూరు గ్రామంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ చైల్డ్ ఫండ్ లింక్ వర్కర్స్ సంస్థ ఆధ్వర్యంలో సుప్రియ గ్రామస్తులకు సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి కిరణ్ మై తదితరులు పాల్గొన్నారు.



ఆయుర్వేద వైద్యశాల ప్రారంభం

ప్రజాశక్తి - కావలి : కావలి పట్టణం 2వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్.కె.మోడరన్ ఆయుర్వేద వైద్యశాలను కావలి ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి బుధవారం ప్రారంభించారు. వార్డుకు విచ్చేసిన ఎంఎల్‌ఎకు స్థానిక నాయకులు, ప్రజలు, వైద్యశాల యాజమాన్యం ఘనస్వాగతం పలికారు. రిబ్బన్ కట్ చేసి వైద్యశాలను ప్రారంభించారు. అనంతరం జరిగిన పూజా కార్యక్రమంలో ఎంఎల్‌ఎ పాల్గొన్నారు. మంచి వైద్యసేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని క్రిష్ణారెడ్డి ఆకాంక్షించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : పట్టణంలోని జెఆర్‌పేటలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌కె కె.ముత్యాలరావు వివరాల మేరకు.. బి. నరసింహారావు అనే వ్యక్తి స్థానికంగా ఉన్న ఓ ప్రయివేట్ ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గత శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి వారి సొంత గ్రామానికి వెళ్లారు. బుధవారం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉండడం బీరువా తలుపులు తెరిచి ఉండడం చూసి చోరీ జరిగిందని గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ ముత్యాలరావు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ చోరీలో సవర బరువు కలిగిన చిన్న బంగారు వస్తువులు 750 గ్రామాల మూడు వెండి నాణేలు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

నిందితులకు మూడేళ్లు జైలు

ప్రజాశక్తి-కోవూరు : పసిబిడ్డను కిడ్నాప్ చేసిన కేసులో నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఆడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాసు మేజిస్ట్రేట్ కాత్యాయని బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెంలోని 2023 ఆగస్టు 8న ఇంట్లో ఎవతూ లేని సమయంలో పసిబిడ్డను అపహరించుకోని పోయినారు. ఈ కేసులో నిదుతులకు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.6వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున ఎపిపి మాల్యాద్రి వాదించారు.

తహశీల్దార్ కోసం ఎదురు చూపు..

ప్రజాశక్తి-వరికుంటపాడు

సార్వత్రిక ఎన్నికలలో భాగంగా విధుల కోసం వచ్చిన తహశీల్దార్ అరుణదేవి వారం రోజుల క్రితం బదిలీపై వెళ్లారు. అయితే ఇక్కడికి తహశీల్దార్‌ను ఎవరిని నియమించక పోవడంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, వారితల్లి తండ్రులు కులధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం ప్రతిరోజూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. తహశీల్దార్ లేకపోవడంతో వాటిని మంజూరు చేయలేమాని రెవెన్యూ సిబ్బంది చెబుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం మంజూరు చేసిన మిని గోకులాలు, గొర్రెల సెడ్, కోళ్ల సెడ్, కోసం చిన్న కార -సన్నకార రైతులు ధ్రువీరణ పత్రం కావాల్సి ఉంది. వీటికోసం రైతులు ప్రతిరోజూ కార్యాలయం చుట్టూ ప్రతిరోజూ తిరుగుతూ ఉన్నారు. తహశీల్దార్ లేకపోవడంతో ఎప్పుడొస్తారో.. అని నిరాశతో వెనుదిరుగుతున్నా రు. జిల్లా కలెక్టర్ జిల్లాలోని అన్ని మండలాలకు తహశీల్దార్‌లను నియమించారని వరికుంటపాడు మండలానికి పల్నాడు జిల్లా నుంచి ఎస్ఎమ్‌డి హుస్సేన్‌ను నియమించారు. అయితే ఇప్పటికి విధులుకు హాజరు ఆకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలో దాదాపుగా 24 పంచాయతీలు ఉన్నాయి. రెవెన్యూ పరంగా ఏ అవసరమైన తహశీల్దార్‌పై ఆధారపడి ఉంది. వెంటనే తహశీల్దారును నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



హోం మంత్రిని కలిసిన అధికారులు



ప్రజాశక్తి-కోవూరు : రోడ్డు మార్గం గుండా తిరుమలకు వెళ్తూ మార్గం మధ్యలో కోవూరు హోటల్ గ్రాండ్‌లో ఆగిన రాష్ట్ర హోంమంత్రి అనితను కోవూరు సిఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ రంగనాథ్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం పలు విషయాలు చర్చించారు. స్థానిక నాయకులు, తదితరులున్నారు.

విలేజ్ మిల్క్‌షాప్ ప్రారంభం

ప్రజాశక్తి - కావలి : ఆటో నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన విలేజ్ మిల్క్ షాప్‌ను ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి బుధవారం ప్రారంభించారు. వ్యాపారం దినదినాభివృద్ధి జరగాలని ఎంఎల్‌ఎ ఆకాంక్షించారు. నాణ్యమైన వస్తువులను అందించి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు.



జె.బి.లో జాతీయ చేనేత దినోత్సవం

ప్రజాశక్తి-కావలి : స్థానిక జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో బుధవారం "జాతీయ చేనేత దినోత్సవ" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ చేనేత వస్త్రాలను ధరించడం భారతీయ సంస్కృతి, సాంప్రదాయమని తెలిపారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులందరూ చేనేత వస్త్రాలను ధరించి పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని తెలియజేశారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఆర్.మాల్యాద్రి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులందరూ పాల్గొని "మన చేనేత మన కట్టు- మనసంస్కృతి" మన సాంప్రదాయం అని నినాదాలు చేశారు.

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

ప్రజాశక్తి-కావలి : అభివృద్ధి చేస్తామంటే సహకరిస్తామే గానీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదని మాజీ ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని "జర్నలిస్ట్ క్లబ్"లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కావలి శాసన సభ్యులుగా దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి గెలుపొందటం స్వాగతిస్తున్నామని, అలానే కావలి నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదని, ఎంతటి వారినైనా ఎదుర్కునేందుకు సిద్ధమని తెలిపారు. పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు 125 ఎకరాలు ఆక్రమించారని పనిగట్టుకొని ప్రచారం చేస్తున్నారని, అలాంటి వాస్తవాలు ఉంటే సర్వే నెంబర్లతో సహా కావలి ఆర్‌డిఒ ద్వారా శ్వేతపత్రం విడుదల చేయించాలన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వారు బాగున్నారని, అలానే అమ్మిన రైతులు బాగున్నారని, కానీ నష్టపోయేది కొనుగోలు చేసే పేదలేనన్నారు. అలాంటి వారి కడుపు కొట్టడం మంచి పద్ధతి కాదని తెలిపారు. గతంలో అక్రమ లేఅవుట్లు వేస్తుంటే తమ ప్రభుత్వ హయాంలోనే నుడా లేఅవుట్లను ప్రోత్సహించామన్నారు. ఆక్రమణంలోనే చేపట్టాలంటే మీ దగ్గర ఉన్న టిడిపి నాయకుడు నాయుడు రాంప్రసాద్ కావలి చెరువులో 25ఎకరాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఉన్నారని ముందు వాటిని తొలగించాలని కోరారు. మున్సిపాలిటీ, ప్రభుత్వ హాస్పిటల్, ఎన్‌ఆర్‌ఇజిసిలలో,అవుట్ సోర్సింగ్‌లలో, కాంట్రాక్ట్ బేసిక్‌లో పని చేస్తున్న ఉద్యోగులను తొలగించడం బాధాకరమన్నారు. వారందరూ కూడా పేదవారేనని తెలిపారు. గతంలో తాము ఎక్కడా కూడా ఇలాంటి ఉద్యోగులను తొలగించలేదని అవసరమైతే మరికొందరిని జాయిన్ చేశామన్నారు. ఇప్పుడు అలాకాకుండా వారిని తొలగించి వారి పొట్ట కొట్టడం మంచిపద్ధతి కాదని తెలిపారు. అవసరమైతే కోర్టుకు వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అధికార పార్టీ నాయకుల దాడిలో గాయపడ్డ వైసిపి కార్యకర్త నటరాజ్‌కు జగన్మోహన్ రెడ్డి రూ.50వేల చెక్కును మాజీ ఎంఎల్‌ఎ ప్రతాప్‌కుమార్ రెడ్డి చేతుల మీదుగా బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, కనమర్లపూడి నారాయణ, బోగోలు మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, అల్లూరు మండల కన్వీనర్ బీద రమేష్, పార్టీ సీనియర్ నాయకులు కుందుర్తి శ్రీనివాసులు, సాయి, పరుసు మాల్యాద్రి, నాగేశ్వరమ్మ, మత్స్యకార నాయకుడు కొమరి రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌ఎ రామిరెడ్డి

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని చుంచులూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను, ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య ఆరోగ్యశాఖ, అంగన్‌వాడీ సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నాగిరెడ్డి, చుంచులూరు మెయిన్ ప్రధానోపాధ్యాయులు సునీత, ఎఎన్‌ఎం వేళాంగిణి, స్టాఫ్ నర్స్ సౌజన్య, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదిలక్ష్మి, తిరుపాలమ్మ, శ్రీ కళ, నాగమణి, ఆశా కార్యకర్తలు ఉమారాణి, తిరుపతమ్మ, బాలింతలు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామంలో 46 వంటకాలతో అందరిని ఆకర్శించేలా, అబ్బురుపరిచే రీతిలో పెద్దిరెడ్డిపల్లి సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లు అందరూ హాజరై తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెక్టార్ సూపర్‌వైజర్ కళావతి హాజరయ్యారు. కార్యక్రమానికి సెక్టార్ కార్యకర్తలు, సర్పంచ్ మహేష్, ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, ఎఎన్‌ఎం, ఆశాలు బాలింతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : 1వ తేదీ నుంచి ప్రారంభమైన తల్లిపాలు వారోత్సవాలు బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఓ పద్మావతి ఆదేశాల మేరకు ప్రతి అంగన్‌వాడీ సెంటర్లో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించామని సూపర్‌వైజర్ శారద తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్ కె.భాగ్యమ్మ, బి.లక్ష్మి స్వరూప, నూర్జహాన్, సల్మాన్, డి.భాగ్యమ్మ, పెంచలనరసింహ, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం సిఆర్‌పాలెం పంచాయతీ, పాతపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఐసిడిఎస్ జువ్వలదిన్నె సెక్టార్ సూపర్‌వైజర్ బి.వి.సుభాషిణి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. అనంతరం గర్భవతులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎం హారిక, జోత్స్న, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, బాలింతలు, తల్లులు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-విడవలూరు : మండల పరిధిలోని ఊటుకూరు ముదివర్తి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమణి అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ రమణి మాట్లాడుతూ బిడ్డకు తల్లి ముర్రిపాలు ఇవ్వడం వల్ల రోగ నిరోధక శక్తి పెంచుతుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయమ్మలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ఉదయగిరి : 1వ తేదీన ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. స్థానిక బిట్-3 సచివాలయంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆరోగ్య బోధకులు వెంకటసుబ్బయ్య తల్లిపాల ఆవశ్యకత గురించి బాలింతలకు వివరించారు. కోళ్ల వీధి అంగన్‌వాడీ కార్యకర్త కె.ప్రమీలా దేవి, బోయవీధి కార్యకర్త సి హెచ్ వి రత్నమ్మ, కరీమా వీధి ఎస్‌కె మహబూబ్ జాన్, ఉదయగిరి హెచ్‌ఆర్‌పి పద్మ, ఎఎన్‌ఎం నూర్జహాన్, వీరేంద్ర, నరసింహ, సుధీర్, రామారావు, జోత్స్న, రబ్బానీ, ఆశాలు అంకమ్మ, పి.లక్ష్మి పాల్గొన్నారు.